teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 157 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 30 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రాష్ట్రపతి నిలయంలో ప్రారంభమైన కళా మహోత్సవం 2024



.. వివరాలు 2లో

సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 6 వరకు సందర్శకులకు అవకాశం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు

మిగతా 2 లో



# పాఠశాలలకు ఉచిత విద్యుత్

### ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు..

### బకాయిల చెల్లింపుపై లేని స్పష్టత

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ఇందన శాఖ జీవోఎంఎస్ నం.20 జారీ చేసింది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు విద్యుత్ తప్పనిసరి. బిల్లులు పేరుకుపోతే విద్యుత్ సంస్థ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుంది.



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): కరంటు సరఫరాలో అంతరాయం కలిగి డిజిటల్ పాఠాలకు ఆటంకం ఏర్పడుతుంది. అంతేగాకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులకు ఏసీ సౌకర్యం కల్పిస్తున్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి వర్ణనాతీతం. కొన్ని పాఠశాలల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేని దుస్థితిలో ఉన్నాయి. ఒకవేళ ఫ్యాన్లు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అవి పనిచేయని స్థితిలో ఉన్నాయి. ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో

మిగతా 2 లో



## బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనకై పింక్ పవర్ రన్

మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి సాధికారతతో పాటు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ గురించి

మిగతా 2 లో



### అందుబాటులోకి రానున్న కాలుష్యరహిత లగ్జరీ బస్సులు

అత్యాధునిక హంగులతో 35 బస్సులు : ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

కరీంనగర్ జిల్లా, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణలో తొలిసారిగా కాలుష్యరహిత ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు

మిగతా 2 లో

## తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం

114వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని పలు అంశాలపై ప్రస్తావన



తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా, జరిగిన 114వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ పలు అంశాలను ప్రస్తావించారు. ఇందులో భాగంగా తెలంగాణకు సంబంధించి రాష్ట్ర ప్రజలను పొగడ్తలతో ముంచెత్తారు. ప్రతి నెల చివరి ఆదివారం ఆల్ ఇండియా రేడియో కార్యక్రమంలో మన్ కీ బాత్ ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మ్మోదీ మాట్లాడుతున్న విషయం తెలిసిందే.

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రజలను ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. అనుకున్న లక్ష్యం కంటే మొక్కలను అధిక సంఖ్యలో నాటారన్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రజలు సరికొత్త రికార్డు సాధించారని తెలిపారు. తెలంగాణతో పాటు ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు సైతం కొత్త రికార్డును నెలకొల్పినట్లు పేర్కొన్నారు. ఇదంతా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా జరిగింది. ఇదిలా ఉండగా, ఈ మన్ కీ బాత్ చాలా ప్రత్యేకమైంది. నేటితో మన్ కీ బాత్ 10 ఏళ్లు

మిగతా 2 లో



## టీజీఎస్ ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగ నియామకాలు

3వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు సమాచారం

ప్రకటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): నిరుద్యోగులకు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. టీజీఎస్ ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగాల నియామకాలు చేపడతామని ప్రకటించారు. ఆర్టీసీలో వివిధ విభాగాలకు చెందిన 3వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. మంత్రి కరీంనగర్ లో 33 కొత్త

మిగతా 2 లో



### మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు తుది మెరుగులు

మొత్తం 116.2 కిలోమీటర్లలో మెట్రో రైలు రెండో దశ పనులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు తుది

మిగతా 2 లో

## ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చడమా..?

హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తప్పకుండా తగులుతుంది

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తప్పకుండా తగులుతుందన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చడమా.. అంటూ ప్రశ్నించారు. అలాగే, ప్రభుత్వం ఇప్పుడికైనా హైడ్రాపై సమీక్ష చేయాలన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదివారం

మిగతా 2 లో




## గోషామాల్ ఎమ్మెల్యే హత్యకు రెక్కీ

ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సెల్ ఫోన్ సమాచారంతో రెక్కి నిర్దారణ

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణాలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ ఎంఎల్ఏ హత్యకు రెక్కీ జరిగింది. బీజేపీ గోషామహల్ ఎంఎల్ఏ రాజాసింగ్ ను హత్యచేసేందుకు జరిగిన రెక్కీని పోలీసులు నిర్ధారించారు. తరచూ వివాదాల్లో

మిగతా 2 లో



### రాష్ట్రంలో మరో రెండు రోజులు వానలు

ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ను జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): భాగ్యనగరంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతం అయింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. రాజేంద్రనగర్,

మిగతా 2 లో



## అక్టోబర్‌లో కొత్త రేషన్ కార్డులు ఇస్తాం

ధరణి సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మేడ్చల్ జిల్లా, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా షామీర్ పేటలోని నల్సార్ యూనివర్శిటీలో తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రూపొందించిన ధరణితో అన్నదాతలు చాలా ఇబ్బందులు పడ్డారని మంత్రి గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి బాధలు లేకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా పాలనాధికారి అనుమతి లేకుండా

మిగతా 2 లో

## రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్లతో మంత్రి పొంగులేటి సమావేశం

అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా తహశీల్దార్లతో గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి షామీర్ పేట నల్సార్ యూనివర్శిటీ సమావేశం అయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన ధరణి వల్ల రైతులు చాలా

మిగతా 2 లో



## బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనకై పింక్ పవర్ రన్

**మొదటి పేజీ తరువాయి**

ప్రజల్లో అవగాహన కల్పించేందుకుగాను తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఎంఈఐఎల్ (మెయిల్) ఫౌండేషన్, సుధా రెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వేదికగా పింక్ పవర్ రన్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ పింక్ రన్ ను ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి ప్రారంభించగా బహుమతులను సీఎం రేవంత్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళల ఆరోగ్యమే కుటుంబాలకు బలమని, సమాజ శ్రేయస్సుకు అదే పునాది అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం రాష్ట్రంలో మరిన్ని ఆసుపత్రులు నిర్మిస్తామని, సంబంధిత వ్యవస్థలను బలోపేతం చేస్తామని తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్ పై మహిళలకు అవగాహన కల్పించేందుకు పింక్ రన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను సీఎం అభినందించారు. పక్షి ఆకృతిలో అతిపెద్ద మానవహారంగా ఏర్పడిన వాలంటీర్లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పలువురు వైద్యులు, సుధా రెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు. జెండాఊపి రన్ ప్రారంభించిన మంత్రి దామోదర రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన పింక్ రన్ ను ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి ప్రారంభించారు. ఒకేసారి 3కె, 5కె, 10 కె రన్ నిర్వహించారు. ఈ రన్ లో 5 వేల మందికి పైగా రన్నర్స్ పాల్గొన్నారు. గచ్చిబౌలి స్టేడియం నుండి విప్రో సర్కిల్, టీఎన్జీఓ కాలనీ మీదుగా రన్ కొనసాగింది. పింక్ మారథాన్ లో ఇంత పెద్ద మొత్తంలో రన్నర్స్ పాల్గొనడం వరల్డ్ రికార్డు అని నిర్వాహకులు తెలిపారు. ఈ మారథాన్ లో పాల్గొన్న వారికి న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు.

## అందుబాటులోకి రానున్న కాలుష్యరహిత లగ్జరీ బస్సులు

**మొదటి పేజీ తరువాయి**

అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్టీసీ వెల్లడించింది. ఆదివారం కరీంనగర్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఈ బస్సులను ప్రారంభించారు. అత్యాధునిక హంగులతో వాడకంలోకి వస్తోన్న ఈ 35 బస్సుల్లో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించే సదుపాయాలు ఉన్నాయి. 41 సీటింగ్ సామర్థ్యమున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 325 కిలోమీటర్లు ప్రయాణించే సౌలభ్యం ఉంది. 2-3గంటల్లో వంద శాతం పూర్తి ఛార్జింగ్ అవ్వడమే కాకుండా క్యాబిన్, సెలూన్‌లో రెండు చోట్ల సెక్యూరిటీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరాలను ఆదివారం ఎక్స్ వేదికగా సజ్జనార్ వెల్లడించారు.

## గోషామాల్ ఎమ్మెల్యే హత్యకు రెక్కీ

**మొదటి పేజీ తరువాయి**

ఉండే రాజాసింగ్ చాలామందికి ముఖ్యంగా ఏఐఎంఐఎం పార్టీలోని కొందరికి కంట్లో నలుసుగా మారారు. అందుకనే రాజాసింగ్ పై దాడికి ఇప్పటికి చాలాసార్లు ప్రయత్నాలు జరిగాయి. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం ఎంఎల్ఏ ఇంటి దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు గమనించారు. ఇదే విషయాన్ని వెంటనే మంగళహాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారాన్ని అందుకున్న వెంటనే పోలీసులు స్పందించి ఎంఎల్ఏ ఇంటికి చేరుకున్నారు. అయితే పోలీసులు వస్తున్న విషయాన్ని గమనించిన సదరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు చాకచక్యంగా వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయమై రాజాసింగ్ మాట్లాడుతు తనపై రెక్కీ జరిగిన విషయాన్ని పోలీసులు సీరియస్ గా తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఇలాంటి రెక్కీలకు తాను భయపడే వ్యక్తిని కాదని స్పష్టంచేశారు. తనను హత్యచేయటానికి కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తనకు అనుమానంగా ఉందన్నారు. తనింటి చుట్టూ తిరుగుతు, తన కదలికలను గమనిస్తు కొందరు రెక్కీ చేసి విషయాలన్నింటినీ ముంబాయ్ లోని కొందరికి చేరవేస్తున్నట్లు తనకు సమాచారం ఉందని ఎంఎల్ఏ చెప్పారు. మరోవైపు రెక్కీ నిర్వహించిన వ్యక్తులను పోలీసులు ఇస్మాయిల్, మహ్మద్ ఖాజాగా గుర్తించారు. వాళ్ళదగ్గరున్న సెల్ ఫోన్లు తీసుకుని ఓపెన్ చేస్తే రాజాసింగ్ ఫొటోలు, తుపాకులు, బుల్లెట్ల వివరాలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాజాసింగ్ హత్యకు రెక్కీ జరిగిందన్న విషయం తెలియగానే ఓల్డ్ సిటీలోని గోషామహల్ నియోజకవర్గంతో పాటు పార్టీలో ఒక్కసారిగా సంచలనం మొదలైంది. రాజాసింగ్ అంటేనే పార్టీలో ఫైర్ బ్రాండ్ గా చాలా పాపులర్. గోషామహల్ నియోజకవర్గం నుండి రాజాసింగ్ మూడుసార్లు వరుసగా గెలుస్తున్నారు. ఇదివరకు కూడా రాజాసింగ్ ను చంపేందుకు ప్రయత్నాలు జరిగాయి. పాకిస్ధాన్, నేపాల్ లోని కొందరు వ్యక్తుల ఆదేశాల ప్రకారమే తాను రాజాసింగ్ హత్యకు ప్రయత్నించినట్లు అప్పట్లో పట్టుబడిన గుజరాత్ యువకుడు చెప్పిన విషయం తెలిసిందే. ఎంఎల్ఏ హత్యకు కోటిరూపాయల సుపారీ కుదిరినట్లు కూడా చెప్పాడు. ఈ నేపధ్యంలోనే తాజాగా ఇద్దరు యువకులు రాజాసింగ్ హత్యకు రెక్కీ జరిగిందనే విషయం సంచలనంగా మారింది. రాజాసింగ్ పై ఇప్పటికి 105 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.

## అక్టోబర్‌లో కొత్త రేషన్ కార్డులు ఇస్తాం

**మొదటి పేజీ తరువాయి**

తహశీల్దార్ పై కేసు పెట్టకుండా ఆదేశిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న తహశీల్దార్లలో 90 శాతం మంది రైతు కుటుంబం నుంచే వచ్చారని వారికి అన్నదాతల బాధ తెలుసని అందుకే వారు ఎలాంటి లాభాపేక్ష లేకుండా రైతులకు పని చేయాలని సూచించారు. కాగా అక్టోబర్ లో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి ఇదివరకే ప్రకటించారు. త్వరలో దరఖాస్తులు స్వీకరించి కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో చాలా మంది కొంత రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ప్రజా పాలనలో దరఖాస్తులు తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ దరఖాస్తులు ఎక్కడున్నాయి. వాటిని ప్రాసెస్ చేశారా అనేది తెలియలేదు. మరోవైపు రైతు రుణ మాఫీ కూడా అందరికి కాలేదు. దీంతో రైతులు కూడా రుణ మాఫీ పూర్తి చేయాలని కోరుతున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్లతో మంత్రి పొంగులేటి సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

ఇబ్బంది పడ్డారని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేసి పేదవారి పక్షాన ఉంటుందని మంత్రి అన్నారు. ధరణి పోర్టల్ తో ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. మార్పు రావాలి. ఇందిరమ్మ రాజ్యం కావాలంటూ.. సామాన్య ప్రజలకు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి ఎలా సర్వీస్ చేయాలో తహశీల్దార్లకు పూర్తి అవగాహన ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో పేరుకు మాత్రమే తహశీల్దార్ కార్యాలయాలని ఎలాంటి వసతులు లేకుండా ఉండేవనన్నారు. కనీసం వాచ్ మెన్ కూడా ఉండేవారు కాదన్నారు. స్టేషనరీ ఖర్చులు, వాహన సౌకర్యం ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తహశీల్దార్ కార్యాలయాలకు కొత్త బిల్డింగ్‌లు కట్టే విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు, ప్రజా ప్రతినిథులు.. మంత్రులు.. అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి పేదల సమస్యలు పరిష్కరించాలన్నారు. అందరూ కలిసి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పని చేస్తే.. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. తహశీల్దార్ పెట్టే సంతకం ముఖ్యమే తెలుసంటూ కొంతమంది ఉద్యోగుల వల్ల రెవిన్యూ వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. ఎవరైనా తహశీల్దార్ ఫిర్యాదు చేస్తే కలెక్టర్ అనుమతి లేకుండా కేసు నమోదు చేయవద్దని తర్వలో ఆదేశాలు జారీ అవుతాయన్నారు. భూముల విషయంలో గతంలో ఏమైనా అవకతవకలు ఉంటే పేదవారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్లు 90 శాతం మంది రైతు కుటుంబం నుంచి వచ్చారని. వాళ్ల బాధలు మీకు తెలిసే ఉంటాయన్నారు. రేవంత్ సర్కార్ లో పేదలకు మంచి చేసేందుకు మీశీనన్న ఇటు అధికారులకు అటు ప్రజలకు అందుబాటులో ఉంటానని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## రాష్ట్రపతి నిలయంలో ప్రారంభమైన కళా మహోత్సవం 2024




సికింద్రాబాద్, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం వేదికగా భారతీయ కళా మహోత్సవం 2024 ఆదివారం నుంచి ప్రారంభమైంది. సందర్శకుల కోసం సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 6 వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ మేరకు తెలంగాణ సీఎంవో నుంచి ఆదివారం ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, జీవనశైలితో కూడిన కళలను ప్రదర్శించే ఈ అద్భుతమైన వేడుకలో హైదరాబాద్ ప్రజలందరూ పాల్గొనే అవకాశం కల్పించినందుకు గాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖలను ముఖ్యమంత్రి రేవంత్ అభినందించారు. కాగా, తెలంగాణలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో భాగంగా శనివారం భారతీయ కళా మహోత్సవ్ మోదటి ఎడిషన్‌ను సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ప్రారంభించారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక శాఖ సహకారంతో రాష్ట్రపతి నిలయం నిర్వహిస్తోంది.

# వాట్సప్‌లో వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం..?




K.Vishwanath
M.Sc,MA,B.Ed, LLB
Advocate-
Cell:9603139387




ఎమ్మార్పీ (MRP) కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తున్నారా? నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవాలోపానికి పాల్పడ్డారా? అయితే ఇక నుంచి మీ ఇంటి నుంచే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఇందు కోసం వాట్సప్ చాట్‌బాట్ సేవలను తీసుకొచ్చింది. వాట్సప్ నంబర్ 88000 01915 లో మొదట హాయ్ అని టైప్ చేయాలి. అక్కడి సూచనల ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది. అనంతరం కేసు పరిష్కారం కోసం ఈ వివరాలు ఆయా జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారు. కేసు పరిష్కారం అయ్యే వరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారు. దీంతో పాటు 1800114000 లేదా 1915 నంబర్‌కు కాల్ చేసి సైతం (ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు) ఫిర్యాదు చేయొచ్చు. ప్రతి రోజూ వేల ఫిర్యాదులు నమోదవుతుండగా, అందులో పరిష్కారమైన కేసులకు సంబంధించిన వివరాలను కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ https:/consumerhelpline.gov.in వెబ్‌సైట్‌లో ఎన్‌సీహెచ్ సక్సెస్ స్టోరీస్ పేరుతో పొందుపరుస్తోంది.

# పాఠశాలలకు ఉచిత విద్యుత్



**మొదటి పేజీ తరువాయి**

కనీస సౌకర్యాలు కొరవడుతుండడంతో రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తే అవిబలోపేతమయ్యే అవకాశముంది.

### ఆన్‌లైన్ పోర్టల్ ...

ఉచిత విద్యుత్ అందించే ధ్యేయంతో విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రభుత్వ పాఠశాలల వారీగా ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్ రూపొందిస్తున్నాయి. సంబందిత సంస్థలకు లాగిన్ అవకాశం కల్పిస్తున్నాయి. ఈ క్రమంలో సంబంధిత శాఖల కార్యదర్శులు పాఠశాలల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తాయి. ఈ పోర్టల్‌లో వివరాలు నిక్షిప్తం చేసిన సంస్థలకు డిస్కంలు యూనిట్ల వారీగా బిల్లులు నిక్షిప్తం చేస్తాయి. దీంతో పాటు సంబందిత శాఖ బాధ్యులకు బిల్లు హార్డ్ కాపీ ఇస్తారు. పోర్టల్‌లో డిస్కంలు పొందుపరిచిన బిల్లుల మేరకు ఆయా శాఖల బిల్లుల చెల్లింపునకు సంబందించిన నివేదికలు తయారు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. సంస్థలు, జిల్లా, మండలాల వారీగా బిల్లుల సమాచారం పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ బిల్లులు చెల్లించేందుకు వీలుగా ఆయా శాఖలను ఆర్థిక శాఖ పోర్టల్‌తో అనుసంధానిస్తారు. ఉచిత విద్యుత్‌తో విద్యాసంస్థలపై బిల్లుల భారం తప్పనుంది.

### బకాయిలు చెల్లించాలి..

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ప్రభుత్వం బకాయిల చెల్లింపులపై ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ క్రమంలో బకాయిలు ఎవరు చెల్లిస్తారని అధికారులు ప్రశ్నిస్తున్నారు. బకాయి లు రాబట్టుకోవడానికి పంపిణీ సంస్థలు ఎప్పటి మాదిరిగానే విద్యుత్ సరఫరా నిలిపివేస్తే ఉచిత విద్యుత్ పథకం అభాసుపాలయ్యే అవకాశముందని మేధావి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బకాయి ల చెల్లింపుపై స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

### మెయింటెనెన్స్ నిధులు అంతంతే

సర్కారు బడులకు జీరో విద్యుత్ బిల్లుల సౌక ర్యం కల్పించనుండడంతో పేద విద్యార్థులకు మేలు జరుగనుంది. వేసవిలో కరెంట్ కనెక్షన్లు లేని పాఠశాల ల్లో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులున్నాయి. పాఠశాలలకు చాలీచాలని మెయింటెనెన్స్ నిధులు విడుదలవుతుండగా ఇవి విద్యుత్ నిర్వహణకే సరిపోతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించింది. ఫ్యాన్లు, ప్రొజెక్టర్లు, ట్యూబ్‌లైట్లు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వాటర్ ప్లాంట్లు, కంప్యూటర్ విద్య తదితరాల నిర్వ హణకు విద్యుత్ అవసరం ఉంటుంది. దీంతో ఒక్కో పాఠశాలకు రూ.500.ల నుంచి రూ.800.ల వరకు బిల్లు వస్తోంది. మెయింటెనెన్స్ గ్రాంటు సంవత్సరానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు విడుదల చేస్తున్నారు. ఈ నిధులు పాఠశాలల్లోని మౌలిక వసతులకే సరిపోయే పరిస్థితి లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చాలామంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది సొంత డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

## మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు తుది మెరుగులు



**మొదటి పేజీ తరువాయి**

మెరుగులు దిద్దుతోంది. మొత్తం 116.2 కిలోమీటర్లలో మెట్రో రైలు రెండో దశ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఇటీవల జరిపిన సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి సైతం దీనికి ఆమోదం తెలిపారు. రూ.32,237 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. అంతేకాదు. ఈ రెండో దశలో కొత్తగా ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు అందుబాటులోకి రానుందని మెట్రో అధికారులు వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. మరోవైపు ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఆరాంఘర్-బెంగళూరు హైవే కొత్త హైకోర్టు మీదుగా ఎయిర్‌పోర్టుకు మెట్రో లైనును ఫైనల్ చేసింది. కారిడార్-4లో నాగోల్ నుంచి శంషాబాద్ వరకు 36.6 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ఆమోదం తెలిపింది. ఎయిర్ పోర్టు కారిడార్‌లో 1.6 కిలోమీటర్ల మేర భూగర్భ మార్గంలో మెట్రో మార్గం వెళ్లనుంది. రూ.8 వేల కోట్ల అంచనా వ్యయంతో ఫోర్త్ సిటీకి మెట్రో సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. త్వరలోనే కేంద్ర అనుమతుల కోసం మెట్రో రెండో దశ డీపీఆర్‌లు పంపించారు. ఇప్పటికే మొదటి దశలో 3 కారిడార్లలో 69 కిలోమీటర్ల మేర మెట్రో నడుస్తోంది. రెండో దశ కూడా పూర్తయితే మొత్తం 9 కారిడార్లలో 185 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉండనుంది.

## రాష్ట్రంలో మరో రెండు రోజులు వానలు

**మొదటి పేజీ తరువాయి**

అత్తాపూర్, బండ్లగూడలో, గండిపేట, మణికొండ, నార్సింగి, కాటేదాన్ సహా పలు ప్రాంతాల్లో వాన దంచికొడుతోంది. మరికాసేపట్లో నగరంలోని చాలా ప్రాంతాలకు వర్షం విస్తరిస్తుందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. శేరిలింగంపల్లి, మియాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, ఫిలిం నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా అనేక ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఐటీ కారిడర్‌లో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో రాబోయే రెండురోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది. సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న ద్రోణి తమిళనాడు మీదుగా రాయలసీమ వరకు విస్తరించి ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఇవాళ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, కరీంనగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వివరించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## తెలంగాణపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం

**మొదటి పేజీ తరువాయి**

పూర్తి చేసుకుంది. 2014 అక్టోబర్ 3న దసరా పండుగ సమయంలో మన్ కీ బాత్ తొలి ఎపిసోడ్ ప్రారంభమైంది. ఈ మేరకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్న వివిధ టీవీ ఛానళ్లు, ప్రాంతీయ టీవీ ఛానళ్లు, యూటూబర్స్ కి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జూన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మొక్క నాటి తల్లి పేరు పెట్టాలని చెప్పారు. ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పలు రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేశాయి. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా దాదాపు 80 కోట్ల మొక్కలు నాటడంతో తమ లక్ష్యాన్ని చేరుకున్నట్లు కేంద్ర పర్యావరణ శాఖ తెలిపింది. తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కలు నాటేందుకు ఆసక్తి కనబర్చింది. కాగా, అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మొక్కలు నాటింది. దీంతో తెలంగాణలో గ్రీనరీ బాగా పెరిగింది. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కొత్తూరు సుర్వి రాజశేఖర్ మొక్కలు నాటుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇళ్లు కూల్చడమా..?

**మొదటి పేజీ తరువాయి**

మీడియాతో మాట్లాడుతూ.. కిషన్ రెడ్డి రాగానే హైడ్రాపై బీజేపీ కార్యాచరణ ప్రకటిస్తాం. పేదలకు బీజేపీ అండగా ఉంటుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం. బుల్డోజర్లు ముందుగా మామీద నుండి వెళ్లాలి. అప్పుడే పేదల ఇళ్ల వద్దకు బుల్డోజర్లు వెళ్తాయి. తెలంగాణలో హైడ్రా పాపం కాంగ్రెస్‌కు తగులుతుంది. ఎన్ని ఇబ్బందులు తలెత్తిన అధికారులతో మీడియా సమావేశం పెట్టి తప్పును కప్పి పుచ్చుకుంటున్నారు. ఇందిరా రాజ్యం అంటే పేదల ఇళ్ళు కూల్చడమా?. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. భూమి పట్టాలు, లింకు డాక్యుమెంట్స్, గ్రామ పంచాయితీ అనుమతి ఉన్న వారి ఇళ్లను కూడా కూల్చివేస్తున్నారు. అందులో ఉన్న వాళ్లంతా పేదలే. హైడ్రా వల్ల ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింది. ఇప్పటికైనా హైడ్రాపై ప్రభుత్వం సమీక్ష చేయాలి' అంటూ కామెంట్స్ చేశారు.

# టీజీఎస్ ఆర్టీసీలో త్వరలోనే ఉద్యోగ నియామకాలు

**మొదటి పేజీ తరువాయి**

ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో భాగంగా కరీంనగర్ లో 33 బస్సులు ఆదివారం ప్రారంభించినట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ కే దక్కుతుందని అన్నారు. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో 92 కోట్ల ఉచిత మహిళా టికెట్లు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి గానూ రూ.3200 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. బతుకమ్మ, దసరాకు కూడా ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడుపుతామని ప్రకటించారు. ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్సీ, కారుణ్య నియామకాలపై చర్చిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ లో డీజిల్ బస్సులు తగ్గించి.. ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా ఆదివారం అందుబాటులోకి తెచ్చిన 35 బస్సుల్లో ప్రయాణికులకు అనుగుణంగా సౌకర్యాలు ఉన్నాయి. ఈ బస్సుల్లో 41 సీట్లు ఉన్నాయి. ఈ బస్సులు ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 325 కిలోమీటర్లు ప్రయాణిస్తాయని చెబుతున్నారు. 2-3 గంటల్లో వంద శాతం పూర్తి ఛార్జింగ్ కావడమే గాకుండా క్యాబిన్ , సెలూన్‌లో రెండు చోట్ల సెక్యూరిటీ కెమెరాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ)లో ఖాళీగా ఉన్న 3035 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. 3035 పోస్టుల్లో 2000 డ్రైవర్ పోస్టులు ఉండగా.. 743 శ్రామిక్, 114 డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానిక్), 84 డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 11 సెక్షన్ ఆఫీసర్(సివిల్), 7 మెడికల్ ఆఫీసర్(జనరల్), 7 మెడికల్ ఆఫీసర్(స్పెషాలిస్ట్) ఉద్యోగాలు ఉన్నాయి.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## రాజ్యాంగాన్ని చదవండి సార్!

గవర్నర్ ఆర్ఎన్ రవి సెక్యులరిజం యూరోపియన్ భావన, భారతీయ భావన కాదు అన్న దగ్గర నుండి పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కొరడాలతో బలంగా ఒళ్లంతా కొట్టుకునే దాకా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పరిణామాల్ని గురించి దేశమంతటా ముఖ్యంగా మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. ఐపిఎస్ అధికారిగా పనిచేసి గవర్నర్ పదవి అలంకరించిన రవి భా రత రాజ్యాంగం ప్రియాంబుల్‌లో సెక్యులరిజం పదాన్ని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో సవరణ ద్వారా చేర్చారే తప్ప మొదటి నుండి రాజ్యాంగంలో లేదని ఈమధ్య ఎక్కడో మాట్లాడారు. ఎంతో అనుభవజ్ఞుడైన రవి తన పదవీకాలంలో పని ఒత్తిడి కారణంగా రాజ్యాంగాన్ని పూర్తిగా చదివి ఉండరు. గవర్నర్ అయ్యాకనైనా తీరిక వేళల్లో రాజ్యాంగాన్ని పూర్తిగా చదివి ఉంటే బాగుండేది. ఈ మాట ఎందుకు అనవలసివస్తున్నదంటే రాజ్యాంగాన్ని పూర్తిగా చదివిన తమిళనాడు శాసనసభ స్పీకర్ అందులోని ఆర్టికల్స్ 15, 17ను ఉటంకిస్తూ గవర్నర్ గారు చెప్పిన సెక్యులరిజం విదేశీ భావన అనే వాదన ఎట్లా లోపభూయిష్టమైందో తేల్చేశారు.

ఆర్టికల్ 15 ప్రకారం మతం, జాతి, కులం, జన్మించిన ప్రాంతం, లింగం ప్రాతిపదికన వివక్ష చూపడం నిషేధం. ఇక ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధిస్తున్నది. సరే ఎమర్జెన్సీ విధించిన కారణంగా తనకొచ్చిన చెడ్డపేరును తుడిచేసుకోవడానికి ఇందిరా గాంధీ 1976లో రాజ్యాంగ సవరణ ద్వారా సెక్యులరిజం పదాన్ని చేర్చారనే అనుకుందాం. మరి ఆర్టికల్ 15, 17 మాటేమిటి. ఆ రెండు ఆర్టికల్స్ సారాంశమే కదా సెక్యులరిజం. సెక్యులరిజం అంటే ఏమిటి అర్థం. మతాన్ని రాజ్యం నుంచి, ప్రజా జీవితం నుంచి వేరు చేసి చూడమని. రాజ్యాంగాన్ని మనసుపెట్టి చదివి ఉంటే తమిళనాడు గవర్నర్ రవి గారు సెక్యులరిజం విదేశీ భావన అని ఎంతమాత్రం అని ఉండేవారు కాదు. ఇందిరా గాంధీ తన అవసరాల కోసం సెక్యులరిజం పదా న్ని చేర్చారని అని ఉండేవారు కాదు. రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న సెక్యులరిజం భావనను మరింత ప్రస్ఫుటంగా చెప్పడానికి మాత్రమే ఆమె అట్లా చేర్చారని అనుకోవాలి. గవర్నర్ రవి మాత్రమే కాదు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి పరిపాలన సాగించాల్సిన వాళ్లు, రాజకీయ కార్యకలాపాల్లో పా ల్గొనవలసిన వాళ్లు కూడా రాజ్యాంగాన్ని ఎప్పుడూ చదివినట్టు లేరు. గత పది రోజులుగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలకు సంబంధించిన ఒక వివాదం పర్యవసానంగా అక్కడి రాజకీయ నాయకులు కొందరు మాట్లాడుతున్న మాటలు, చేస్తున్న వ్యాఖ్యలు ఈ అభిప్రాయం కలిగిస్తున్నాయి. ఎంతో రాజకీయ అనుభవం కలిగిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదలుకొని, కొన్ని వేల పుస్తకాలు చదివాననే పవన్ కళ్యాణ్ దాకా సెక్యులరిజానికి, మత వి శ్వాసాలకు, సనాతన ధర్మానికి చెబుతున్న అర్థాలు వింటే బహుశా వాళ్ళు రా జ్యాంగం చదువుకోలేదేమో అనే అనుమానం కలుగుతున్నది. మతాన్ని రా జ్యం నుండి, ప్రజా జీవితం నుంచి దూరం చేసి చూడటం అంటే మతాన్ని ఇంటికి పరిమితం చేయమని అర్థం. ప్రజల మధ్య వైషమ్యాలను పెంచడానికి, విభేదాలు సృష్టించడానికి మతాన్ని ఉపయోగించుకోరాదు.

ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మొన్నటి పత్రికా గోష్టిలో నేను ఇంట్లో బైబిల్ చదువుతాను, బయటికి వస్తే హిందూ మతాన్ని, ఇ స్లాం మతాన్ని, సిక్కు మతాన్ని కూడా గౌరవిస్తాను, ఆ మతాచారాల ప్రకారం నడుచుకుంటాను అన్న దానికి అర్థం ఇదే. మనం నమ్మే మతాన్ని, మనం ఆచరించే మతాన్ని ఇతరుల మీద రుద్దకూడదు అని. ఆ మాట అన్నందుకు జగన్ మోహన్ రెడ్డి మీద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. బై బిల్ ఇంట్లో రహస్యంగా ఎందుకు చదవాలి, బయటకు వచ్చి చదవచ్చు కదా అని. జగన్మోహన్ రెడ్డి తరఫున వకాల్తా పుచ్చుకోవడం కాదు గాని, ఆయన కానీ ఆయన తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి గానీ తమ మత విశ్వాసాలను ఎన్నడూ రహస్యంగా ఉంచుకోలేదు. ముఖ్యమైన సందర్భాలలో వారు ఇరువు రు చర్చిలకు వెళ్లడం అందరం చూసినాము. ప్రజా జీవితంలో ఉ న్నంత మా త్రాన మత విశ్వాసాలు ఉండకూడదని ఏమీ లేదు. అయితే మనం అధికారం లో ఉన్నాం కాబట్టి మనం విశ్వసించే మతం మాత్రమే ఉండాలని, అందరూ అదే మతాన్ని ఆచరించాలని కోరుకోవడం రాజ్యాంగ విరుద్ధం. ఇక రాజ్యాంగాన్ని గురించి, మత సామరస్యాన్ని గురించి, సనాతన ధర్మాన్ని గురించి ఎవరికి తోచిన నిర్వచనాలు వారు చెప్పుకోవడం చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు ఇచ్చే ప్రసాదం లడ్డూకు సంబంధించి చెలరేగిన వివాదంలో అక్కడి రాజకీ య నాయకులు మాట్లాడుతున్న మాటలు ఇందుకు నిదర్శ నం. దేవుడిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం, పరిపాల నలో తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం, అదే విధంగా ప్రజల దృష్టిని సమస్యల నుంచి మళ్ళించడం కోసం జరుగుతున్న ఒక పెద్ద ప్రయత్నమే తిరుమలలో లడ్డు కల్తీ అనే వివాదం. మొన్న మే నెలలో ఎన్నికలు జరిగిన తర్వాత నూతన ప్రభుత్వం ఏర్పడి తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారిగా తాను కోరుకున్న అధికారిని నియమించిన తర్వాతనే జులై మాసం లో తిరుమల లడ్డు ప్రసాదం తయారు చేయడానికి ఉపయోగించే నెయ్యిలో కల్తీ కనుగొన్నామని ముఖ్యమంత్రి స్వయం గా చెప్పారు. ఆ నెయ్యి వాడేసామని ముఖ్యమంత్రి, లేదు దాన్ని తిప్పి పంపించేసా మని ఆ యనే కోరి నియమించుకున్న ఎగ్జిక్యూటివ్ అధికారి చెప్తు న్నారు. తిరుమలకు నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటారు. తరచూ దానికి సంబంధించి పరీక్షలు జరుగు తుంటాయి. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉ న్నప్పుడు, ఇటీవల జగన్ మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉ న్నప్పుడు పలుమార్లు నెయ్యి నాణ్య త సరిగ్గా లేదని, కల్తీ జరిగిందని గు ర్తించి తిరస్కరించిన సందర్భాలు చాలా ఉన్నాయి. మరి ఇప్పుడు ఎందుకు ఇది వివాదం అవుతున్నది. మతం అత్యంత సున్నితమైన విషయం. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, భారతదేశం లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా వేంకటేశ్వర స్వామి భక్తులు ఉన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో పరిపాలన చేస్తామని చెప్పుకునే వాళ్ళు మతం గురించి మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది.

# జిల్లాలో బిఆర్ఎస్ నేతల పర్యటన

### – కూలిన చెట్లను పరిశీలించిన గోవింద్ నాయక్, బడే నాగజ్యోతి



తాడ్వాయి, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తాడ్వాయి మండలంలో కూలిన చెట్లను పరిశీలించిన బిఆర్ఎస్ మాజీ గ్రంథాలయ చైర్మన్, ములుగు జిల్లా అధ్యక్షుడు, ములుగు జిల్లా ఇన్చార్జి సీనియర్ నాయకులు గత నెల 31వ తేదీన తీవ్ర మైన గాలులతో ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో లక్షకు పైగా చెట్లు కూలిన సంఘటన అందరికీ తెలిసిందే. లక్షకు పైగా కూలిన చెట్లను ఆదివారం బిఆర్ఎస్ మాజీ గ్రంథాలయ చైర్మన్ ములుగు జిల్లా అధ్యక్షుడు, ములుగు జిల్లా ఇన్చార్జ్, సీనియర్ నాయకులు తాడ్వాయి మండలంలో పర్యటించారు. కూలిన చెట్లను పరిశీలించారు. తాడ్వాయిలో భారీ భీభత్సం జరిగిందని లక్షల చెట్లు నేలకొరిగాయి. ఎన్ని రకాల చెట్లు, ఎన్ని సంవత్సరాల చెట్లు నేలకొరిగాయి అనే విషయం పై అటవీ శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారని, ప్రకృతిని ఎవ్వరూ కూడా ఆపలేరని, దాన్ని ఎదిరించలేమని ఇది చాల పెద్ద ఘటన అని మాజీ గ్రంథాలయ చైర్మన్ గోవింద నాయక్, కాకుల మారి లక్ష్మణరావు, బడే నాగజ్యోతి అన్నారు. ఈ సంఘటన పై అటవీశాఖ అధికారులతో మాట్లాడమని ఇప్పటి వరకు ఇలాంటి సంఘటన చూడలేదని అటవీ శాఖ అధికారులు చెప్పారని గోవింద నాయక్, కాకుల మారి లక్ష్మణరావు, బడే నాగజ్యోతి అన్నారు. అరేబియా మహా సముద్రంలో నుంచి బంగాళా ఖాతం లోనుంచి పెను గాలులు ఒకే సారి రావడం తో కూకటి వేళ్ళతో సహా వృక్షాలు నేల మట్టమయ్యామని గోవింద నాయక్, కాకులమారి లక్ష్మణరావు, బడే నాగజ్యోతి అన్నారు. ఈ గాలి వాన బీవత్సం ఒకవేళ గ్రామాల్లోకి వస్తె గ్రామ ప్రజలందరూ పతంగి లాఎగిరి పోయేవారని అదృష్టవ శాత్తు ఎవరికి కూడా ప్రాణ నష్టం కానీ ఆస్తి నష్టం కానీ జరుగలేదని ఆయన అభిప్రాయ పడ్డారు. 1500 ఎకరాల చెట్లు నేలకొరిగాయనీ ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ఫారెస్ట్ అధికారుల కు ,మంత్రి సీతక్క మరియు అటవీ శాఖ మంత్రి కొండ సురేఖకు మేము ఒకటే చెపుతున్నం. నేలకొరిగిన చెట్ల వద్ద ట్రెంచ్ ఏర్పాటు చేసి పెంచింగ్ ఏర్పాటు చేయాలని గోవింద నాయక్ తెలిపారు. వీరితో ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమారి లక్ష్మణరావు, ములుగు జిల్లా బిఆర్ఎస్ ఇంచార్జి బడే నాగజ్యోతి మరియు తాడ్వాయి మండల అధ్యక్షుడు దండుగల మల్లయ్య, మరియు గ్రామ కమిటీ అధ్యక్షులు సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

# పీఆర్టీయూ మండల నూతన కమిటీ ఎంపిక

### అధ్యక్షులుగా దాసరి చిన్న రాములు
### ప్రధాన కార్యదర్శిగా బొల్లరి దుర్గాప్రసాద్ యాదవ్




పెబ్బేరు, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు పట్టణంలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వనపర్తి జిల్లా ఎన్నికల ప్రతినిధి రామచంద్రుడు ఆధ్వర్యంలో పీఆర్టీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి వనపర్తి జిల్లా పీఆర్టీయూ అధ్యక్షులు వర ప్రసాద్ రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్నికలు సజావుగా జరిగేందుకు తన వంతు కృషి చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ పెబ్బేర్ మండల నూతన కమిటీకి అధ్యక్షులుగా దాసరి చిన్న రాములు, ప్రధాన కార్యదర్శిగా బొల్లరి దుర్గాప్రసాద్ యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి నూతన అధ్యక్షులు దాసరి చిన్న రాములు మాట్లాడుతూ పెబ్బేరు మండలంలోని ఉపాధ్యాయులకు సేవ చేయడం కోసం నా వంతు కృషి చేస్తానని, ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం, ఉపాధ్యాయ సమస్యలపై ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని, తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వరప్రసాద్, వనపర్తి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శివశంకర్ యాదవ్, పెబ్బేరు మండల మాజీ అధ్యక్షులు దొడ్ల దయానంద్, ఉపాధ్యక్షులు కృష్ణయ్య గౌడ్, శ్రీరంగాపురం మండల అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ నాయుడు, చిన్నంబావి మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు, మహేష్, నాగరాజు, శ్రీనివాసులు, రాఘవేంద్రసాగర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు కష్ట సుఖాల్లో తోడున్న పెద్దన్న కుమారన్న

### జననేతను స్మరించుకుంటూ నివాళ్లు



మంగపేట, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఆదివారం మంగపేట మండల కేంద్రం లోని వైస్సార్ సెంటర్ నందు మంగపేట మండల కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రియతమా నాయకులు జననేత బడుగు బలహీన వర్గాలకు పెద్దన్న లాగా అండగా నిలిచి అన్న అంటే హక్కున చేర్చుకున్న మన ములుగు జిల్లా మాజీ అధ్యక్షులు దివంగత నేత స్వర్గీయ శ్రీ నల్లెల కుమారస్వామి 64 వ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం ప్రభుత్వ పాఠశాలలో వృద్ధాశ్రయంలో ఫ్రూట్స్, బ్రేడ్స్ ప్యాకెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్గీయ నల్లెల్ల కుమారన్న జయంతి వేడుకలు

### కొనసాగిద్దాం కుమారన్న ఆశయాలను
### యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య



ములుగు జిల్లా, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మాజీ అధ్యక్షులు స్వర్గీయ కీర్తిశేషులు నల్లెల్ల కుమార స్వామి జన్మదిన వేడుకలు జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య విచ్చేసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ ములుగు జిల్లా ప్రజలకు కుమారన్న లేని లోటు మరువలేనిదని, కూమార్న ఆశయాలను యువత ముందుకు తీసుకోని వెళ్ళాలని తెలియజేశారు. ములుగు జిల్లా ప్రజలకు ఏలాంటి ఆపద వచ్చినా నేను ఉన్నాను అనే ధైర్యం ఇచ్చే మహా నాయకుడు అని కొనియాడారు. ఈ రోజు కుమార్న మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. అయినా అతని ఆశయాలను కొనసాగించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, నల్లెల్ల కుమారన్న తనయుడు భరత్ కుమార్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చునూరి కిషన్, యువజన కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ ప్రధాన కార్యదర్శి కొగిల రాంబాబు, నల్లెల్లె వీరాభిమాని మేడం రమణాకర్, జక్కుల రేవంత్, ప్రభు, ప్రశాంత్, బండి రమేష్, కోటి తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్

ములుగు జిల్లా, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. ఈ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు,9 మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎం.పి. ఓ.లు తప్పకుండా హాజరు కావాల్సిందిగా ఆయన ఆదేశించారు.

# రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమా శంకర్ ఎంపిక



పెబ్బేరు, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ బాలుర హ్యాండ్ బాల్ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 300 కీరకారులు పాల్గొనగా 16 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన ఉమా శంకర్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం ఒక ప్రకటన లో హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి శంకర్ నాయక్ తెలియజేశారు. ఈనెల 9,10,11 తేదీల్లో జరిగే అంతర్ జిల్లా సాయి పోటీల్లో పాల్గొనస్తున్నారు. ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రెటరీ రవి నాయక్ తెలియజేశారు

# వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం



### – మార్కెట్ చైర్మన్ ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి

పెబ్బేరు, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో ప్రత్యేక కృషి చేస్తానని పెబ్బేరు మార్కెట్ చైర్మన్ ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, పంటల ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో పాటు రైతులకు సేవలందించడం కోసం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ల అభివృద్ధికి నిధుల కేటాయింపులో సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నదని అన్నారు. మార్కెట్ అభివృద్ధితోపాటు రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

# గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్



### ఎక్సైజ్ ఎస్ఐ జ్యోతి

పరకాల, సెప్టెంబర్ 29 (తీన్మార్ న్యూస్): పరకాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం పత్తిపాక గ్రామంలో రూట్ వాచ్ నిర్వహించి గుడుంబా రవాణా చేస్తున్న బాబు శివ తిరుపతి (40) తండ్రి ఓకే ఐలయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 30 లీటర్ల గుడుంబా, ఒక బైక్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ రూట్ వాచ్ లో ఎక్సైజ్ ఎస్ఐ జ్యోతి, కాన్స్టేబుల్స్ అఖిల్, దిలీప్ పాల్గొన్నారు.

# వీర్నపల్లిలో పెరుగుతున్న విష జ్వరాలు

### – వైద్య అధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
### – మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్

వీర్నపల్లి : వీర్నపల్లి మండలం విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాలలో విష జ్వరాల ప్రాబల్యం రోజురోజుకు పెరుగుతుంది. ఇప్పటికే వందల సంఖ్యలో ప్రైవేట్ ఆసుపత్రిలో చుట్టూ తిరుగుతూ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రక్త కణాలు సంఖ్య పడిపోవడంతో ప్రజలు ఆందోళన గురవుతున్నారు. ఇప్పటికే సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ హాస్పిటల్ లో వందల సంఖ్యలో అడ్మిట్ అయి చికిత్స తీసుకుంటున్నారు. కావున జిల్లా వైద్యాధికారులు స్పందించి మారుమూల ప్రాంతమైన వీర్నపల్లిలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

